సాక్షి
మంచిర్యాల
శనివారం । 9 । నవంబర్ । 2024



నకిలీ నోట్ల కలకలం

మందమర్రి పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో నకిలీ కరెన్సీ నోట్లు కలకలం రేపుతున్నాయి. ఒకే నంబరు ఉన్న రూ.200 కరెన్సీ నోట్లు కూరగాయల వ్యాపారికి వచ్చాయి. 8లో▸



సైబర్ చోరులు

జిల్లాలో సైబర్ నేరాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. మ్యాట్రీమోని, పార్ట్‌టైం ఉద్యోగాలు, క్రిప్టో ప్రకటన అంటూ మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బులు దోచేస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /20.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

పర్యవేక్షకులు ఉండరేం..!

- జిల్లా విద్యుత్ శాఖలో ఒత్తిడి
- రెండేళ్లలో ఇద్దరు ఎస్ఈల బదిలీ
- విధుల్లో నిర్లక్ష్యం, అక్రమాలు, అవినీతిపై ఫిర్యాదులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్లు(ఎస్ఈ) రెండేళ్లలో ఇద్దరు మారారు. విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి, ఫిర్యాదులు, విద్యుత్ సరఫరాలో అంతరాయం తదితర ఆరోపణల నేపథ్యంలో ఉండలేకపోతున్నట్లు తెలుస్తోంది. 2022 జూన్‌లో జిల్లాకు వచ్చిన ఎస్ఈ ఆర్.శేషారావును విధుల్లో నిర్లక్ష్యం, పలు ఆరోపణలు, ఫిర్యాదులతో ఈ ఏడాది మేలో బదిలీ చేశారు. ఆయన స్థానంలో కార్పొరేట్ కార్యాలయంలో పని చేస్తున్న ఎస్ఈ ఎస్.శ్రావణ్‌కుమార్‌ను నియమించారు. జిల్లాలో నెలకొన్న విద్యుత్ సమస్యలు కొంత వరకు పరిష్కరించడం, అధికారులు, సిబ్బందిని విధుల్లో పరుగులు పెట్టించారు. విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలపై నెన్నెల ఏఈని గత కొన్ని నెలల క్రితం సస్పెండ్ చేశారు. విద్యుత్ సమస్యలపై పలు సమావేశాల్లో విధుల్లో నిర్లక్ష్యం, ఆరోపణలు వచ్చిన అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. జిల్లాలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, పలు ఆరోపణలు తలకు మించిన భారంగా మారుతుండడంతో కార్పొరేట్ కార్యాలయ పలుకుబడితో ఈ నెల 6న రాత్రికి రాత్రే కామారెడ్డికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కరీంనగర్ ఎస్ఈ గంగాధర్‌ను కేటాయించగా.. ఇక్కడికి వచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు. జిల్లా పరిస్థితిని ముందే గమనించి రావడానికి సాహసించడం లేదని తెలుస్తోంది. దీంతో బెల్లంపల్లి డివిజన్ డీఈ రాజన్నకు తాత్కాలికంగా ఇన్‌చార్జి ఎస్ఈ బాధ్యతలు అప్పగించారు. రెండేళ్ల నుంచి మూడేళ్ల తర్వాత సాధారణ బదిలీ కావాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో నెలకొన్న సమస్యలు, ఆరోపణలతో బదిలీ అవుతున్నారు.



జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం

బదిలీల్లో యూనియన్ నాయకుల ఒత్తిడి

రెండేళ్లు పైబడిన విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు సాధారణ బదిలీలు చేపట్టారు. ఎస్ఈ, డీఈ, ఏడీఈలు ఎన్పీడీసీఎల్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయం సీఎండీ ఆదేశాలతో బదిలీలు జరుగగా.. ఏఈ, ఏఏఈలకు జిల్లా ఎస్ఈ బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. కింది స్థాయి సిబ్బంది ఎల్ఎం, ఏఎల్ఎం, జేఎల్ఎంలు, కార్యాలయ సబార్డినేటర్లను మాత్రం డీఈలు బదిలీ చేశారు. నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని గ్రామీణ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లోని సిబ్బంది పట్టణాలకు బదిలీ కావాల్సి ఉంది. కానీ జిల్లాలో యూనియన్ నాయకుల ఒత్తిడి వల్ల డీఈలు కొన్ని చోట్ల పట్టణ ప్రాంతాల్లో పని చేస్తున్న లైన్‌మెన్‌లను పట్టణ ప్రాంతంలోనే కేటాయించినట్లు తెలుస్తోంది. ఒకేచోట టౌన్–1 నుంచి టౌన్–2, టౌన్–2 నుంచి టౌన్–3 ఇక్కడిక్కడే బదిలీ జరిగాయి. దీంతో తమకు అన్యాయం జరిగిందని గ్రామీణ ప్రాంతల్లోని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సరఫరాలో అంతరాయం..

ప్రతీ నెల రెండో శనివారం మరమ్మతుల పేరిట ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతోపాటు వారానికి రెండు మూడుసార్లు మరమ్మతులు అంటూ గంటా రెండు గంటలు కోత విధిస్తున్నారు. ఇన్ని నెలల నుంచి మరమ్మతులు చేపడుతున్నా సరఫరాలో అంతరాయం మాత్రం తగ్గడం లేదు. ఈ నెల ఏడున కలెక్టరేట్‌లో జరిగిన దిశ సమావేశంలోనూ విద్యుత్ అంతరాయంపై పెద్దపల్లి ఎంపీ వంశీక్రిష్ణ ప్రస్తావించారు. తాను స్వయంగా విద్యుత్ అంతరాయం చూశానని, మీరు అంతరాయం లేదంటున్నారని విద్యుత్ అధికారులను నిలదీశారు. జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు లేని ఇళ్లు 200 మాత్రమే ఉన్నాయని తెలపడమేమిటని, మారుమూల ప్రాంతాల్లో చాలావరకు ఉన్నాయని, వాటన్నింటినీ గుర్తించి నివేదిక అందించాలని ఇంచార్జి ఎస్ఈ రాజన్నకు సూచించారు. జిల్లాలోని చెన్నూర్ డివిజన్ పరిధితోపాటు దండేపల్లి, జన్నారం, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, వేమనపల్లి, కోటపల్లి మండలాల్లో విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాలు పెరుగుతున్నాయి. పాడిపశువులు, మనుషులు మృత్యువాత పడుతున్నారు. కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు, నేలకు వంగిన విద్యుత్ స్తంభాలు, కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు సకాలంలో మరమ్మతు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. పంట పొలాల్లో స్తంభాలు, తీగలపై ఫిర్యాదు చేసినా ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కొత్తవి, పాతవాటి మార్పు తదితర వాటి కోసం వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటున్నారు. మంజూరైనా స్తంభాలు వేయకపోవడం, వ్యవసాయ రంగ కనెక్షన్లు సత్వరమే ఇవ్వడం లేదన్న ఆరోపణలున్నాయి. కొత్తగా వెలుస్తున్న వెంచర్లకు మాత్రం ఆలస్యం చేయకుండా ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ పోయినా చేయి తడపనిదే రావడం లేదని పేరు వెల్లడించడానికి ఇష్టపడని రైతులు వాపోయారు. ఎక్కడ తమ పేరు బయటపెడితే సాగు సమయంలో విద్యుత్ సమస్య తలెత్తితే ''మీరు పేపరు వాళ్లకు చెప్పారు కదా సరే చూద్దాం..'' అంటూ ఇటీవల వంగిన స్తంభాలపై 'సాక్షి'లో వచ్చిన కథనాన్ని ప్రస్తావిస్తూ బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిపారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి
- ఓటరు జాబితాపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి, పక్కన కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచి ర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ ఈఆర్ఓలు శ్రీనివాస్ రావు, హరికృష్ణ, చంద్రకళలతో కలిసి తహసీల్దార్లు, ఎన్నికల అధికారులతో ఓటరు జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 18ఏళ్ల వయస్సు నుంచి అర్హులైన ప్రతీ ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో నమోదు చేయాలని చెప్పారు. నూతన ఓటరు నమోదుకు ఫారం 6 ద్వారా దరఖాస్తు స్వీకరించా లని, సవరణలో భాగంగా పేర్లు, చిరునామా, ఇతర తప్పుల సవరణకు అందిన దరఖాస్తులు పరిష్కరించాలని, మరణించిన వారి వివరాలు జాబితా నుంచి తొలిగించాలని అన్నారు. పంచాయతీ ఎన్నికలకు ఓటరు జాబితా ముఖ్యమని తెలిపారు. నూతన ఓటరు నమోదుకు జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1వ తేదీలను ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితాలో సవరణకు బూత్ స్థాయి అధికారులతో ఇంటింటా సర్వే చేపడుతామని, అక్టోబర్ 29న ఓటరు జాబితా ముసాయిదా ప్రకటిస్తామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే బూత్ స్థాయి అధికారులకు తెలియజేయాలని అన్నారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం అనంతరం తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెల 9, 10వ తేదీల్లో ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం చేపడుతామని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అనంతరం నస్పూర్ మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో, జైపూర్ మండల ఇందారంలో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

బెల్లంపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం బెల్లంపల్లిలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, కాంగ్రెస్ శ్రేణులు అట్టహాసంగా నిర్వహించారు. ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే వినోద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్ కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా చోట్ల నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జే.శ్వేత, మాజీ చైర్‌పర్సన్ ఎం.సూరిబాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎం.మల్లయ్య, మాజీ అధ్యక్షుడు కే.శ్రీనివాస్, నాయకులు మునిమంద రమేష్, దావ రమేష్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలఅర్బన్: స్థానిక బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శుక్రవారం సందర్శించారు. వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించారు. స్టోర్ రూమ్, వంటసామగ్రి, సరుకులు, వంట తయారీని పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు.

విద్యార్థులకు అస్వస్థత

బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన మరో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలుస్తోంది. ఇదివరకు అస్వస్థతకు గురైన 12 మంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కాగా, వసతిగృహంలోనే వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేశారు.

న్యాయ సేవాధికార సంస్థలో పోస్టుల భర్తీ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ 1, స్టెనో/టైపిస్ట్ 1, రికార్డు అసిస్టెంట్ 1 పోస్టులు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 22న సాయంత్రం 5 గంటలలోగా మంచిర్యాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయ సేవా సదన్, జిల్లా న్యాయస్థానం మంచిర్యాలకు చేరే విధంగా రిజిష్టర్ పోస్ట్, కొరియర్ ద్వారా పంపించాలని పేర్కొన్నారు. డిసెంబర్ 8న ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానం భవన సముదాయంలో రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు http://ecourts.gov.in/mancherial వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

జాతీయ సదస్సుకు ఉపాధ్యాయుడు ఎంపిక



కాసం సంతోష్

కాసిపేట: కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కాసం సంతోష్ ఎస్‌సీఈఆర్‌టీ జాతీయ గణిత సదస్సుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సాంబమూర్తి తెలిపారు. డిసెంబర్ 21, 22వ తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే సదస్సులో పాల్గొంటారని పేర్కొన్నారు. గణిత విద్యలో సంతోష్ ఎనలేని కృషికి డీఈవో యాదయ్య, విద్యా పర్యవేక్షణ అధికారి సత్యనారాయణమూర్తి, మండల విద్యాధికారి వేంకటేశ్వరస్వామి, హెచ్ఎం సాంబమూర్తి అభినందించారు.

'ప్రభుత్వం బకాయిలు చెల్లించాలి'

శ్రీరాంపూర్: సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ 3 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి నిధులను ఈ ప్రాంతంలోనే ఖర్చు చేయాలని తెలిపారు. పలువురు కార్మికులు బీఎంఎస్‌లో చేరగా వారికి సత్తయ్య కండువా కప్పి స్వాగతం పలికారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, నాయకులు శ్రీకాంత్, రమేష్, మహేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ

మంచిర్యాలటౌన్: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, మంచి మార్గంలోనే నడవాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా యువజనోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ యువతీ, యువకులు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్‌వీర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సీహెచ్.దుర్గాప్రసాద్, బీసీ వెల్ఫేర్ అధికారి వినోద్‌కుమార్, వయోజన విద్యాధికారి ఎ.పురుషోత్తం నాయక్, లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



కోచ్‌తో బాక్సింగ్ చేస్తున్న ఎంపీ వంశీక్రిష్ణ

విజేతలుగా నిలిచిన మౌనిక, సాత్విక, షిఫా షానారిష్ బృందాలు, భీమారానికి చెందిన టి.ప్రియాంక, జన్నారానికి చెందిన లకావత్ దివ్య, చెన్నూరుకు చెందిన ఆవునూరి నిక్షితలకు బహుమతులు ప్రదానం చేశారు.

మార్నింగ్ వాక్

మంచిర్యాలటౌన్: ఎంపీ వంశీక్రిష్ణ శుక్రవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మార్నింగ్ వాక్ చేశారు. వాకింగ్ చేస్తున్న వారితోపాటు విద్యార్థులను ఆత్మీయంగా పలుకరించారు. అనంతరం బాక్సింగ్ కోచ్ రాజేశ్‌తో బాక్సింగ్ చేశారు. హెచ్‌సీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ కోచింగ్ కేంద్రంలో కాసేపు క్రికెట్ ఆడారు.

పనులు పూర్తిచేయకపోతే బ్లాక్ లిస్ట్‌లో పెడుతా

రామకృష్ణాపూర్: డిసెంబర్‌లోగా పనులు పూర్తిచేయకపోతే బ్లాక్ లిస్ట్‌లో పెడుతానని క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి కాంట్రాక్టర్‌ను ఎంపీ గడ్డం వంశీకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఆర్వోబీ పనుల పురోగతిని పరిశీలించారు. పనులు పూర్తికాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కనిపించటం లేదా నిలదీశారు. కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ గద్దె రాజు, కాంగ్రెస్ నాయకులు పల్లె రాజు, రఘునాథ్ రెడ్డి, గోపతిరాజయ్య పాల్గొన్నారు.

సైకిల్ సవారీ

- జిల్లా అడవుల్లో సైక్లోథాన్ నిర్వహణ
- రేపు క్వారీ అడవుల్లో 20కిలోమీటర్ల సైక్లింగ్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎకో టూరిజం అభివృద్ధిలో భాగంగా అటవీశాఖ మరో అడుగు ముందుకేసి అడవుల్లో సైక్లింగ్‌ను ప్రవేశపెడుతోంది. సైక్లోథాన్ పేరుతో నిర్దిష్ట దూరంలో సఫారీ తరహాలోనే సైకిళ్లపై వెళ్లేందుకు ఔత్సాహికులకు అవకాశం కల్పిస్తోంది. ఈ నెల 10న ఆదివారం ఉదయం 6.30గంటలకు ఏసీసీ క్వారీ గేట్ నుంచి ఈ సైక్లోథాన్ నిర్వస్తున్నారు. అడవిలో 25కిలోమీటర్ల మేరకు సైకిళ్లు వెళ్లేలా ట్రాక్ సిద్ధం చేశారు. కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలో పర్యాటకుల కోసం బర్డ్‌వాచ్, టైగర్ సఫారీ, అడవుల్లో ఫైర్‌క్యాంపు కార్యక్రమాలు చేస్తుండగా, తాజాగా పర్యావరణ హితంగా సైక్లింగ్ ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న లక్సెట్టిపేట అటవీ రేంజ్ పరిధిలో క్వారీ రోడ్డు మీదుగా అడవుల్లో క్వారీ, గాంధారి ఖిల్లా, లోయ, ఎత్తయిన గుట్టల మధ్య ఔత్సాహికులు వన్యప్రాణులను వీక్షిస్తూ ప్రకృతిలో గడిపేలా ఈ కార్యక్రమాలు చేస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌తోపాటు జిల్లా నుంచి పలువురు తమ ఆసక్తిని కనబరుస్తున్నారు. ఇటీవల వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా పర్యాటకులు, సైకిల్ క్లబ్, ఎన్జీవో ప్రతినిధులతో కవ్వాల్‌లో సైక్లింగ్ నిర్వహించారు. ఇదే తరహాలో కవ్వాల్ పరిధితోపాటు జిల్లాలో అవకాశం ఉన్న అడవుల్లో సైక్లింగ్ చేసేందుకు ఎక్కడికక్కడ వసతులు కల్పిస్తున్నారు.



సైక్లింగ్ కోసం ఏర్పాటు చేసిన ట్రాక్

పెరగనున్న సందర్శకులు..

అటవీ అందాలను ప్రత్యక్షంగా వీక్షిస్తూ వన్యప్రాణులు నేరుగా చూసే అవకాశం కల్పిస్తుండడంతో పర్యాటకులు పెరుగుతారని అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడుతూనే పర్యాటకులకు సరికొత్త అనుభూతి కల్పించేలా ప్రణాళిక వేస్తున్నారు. ఇందులో భాగంగా అవసమైన చోట్ల బట్టర్‌ఫ్లై పార్కులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు చోట్ల బట్టర్‌ఫ్లై పార్కులు ఏర్పాటయ్యాయి. పలు రకాల సీతాకోక చిలుకలపై అధ్యయనం జరుగుతోంది. అంతేకాక కొత్త పులుల రాకతోనూ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఈ క్రమంలో భవిష్యత్‌లో జిల్లాకు అడవులను సందర్శించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుందని ఆశిస్తున్నారు.

మెరుగైన విద్య అందించండి

- ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా
- వసతిగృహంలో ఆకస్మిక తనిఖీ

మంచిర్యాలఅర్బన్/జన్నారం: ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా ఆదేశించారు. శుక్రవారం రాత్రి మంచిర్యాల బాలికల ఆశ్రమ పాఠశాల, వసతిగృహం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్య, వైద్యం, భోజనంపై అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు, సరుకుల రిజిష్టర్లు పరిశీలించారు. తరగతిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. జన్నారం మండల కేంద్రంలోని జీసీసీ గోదాం పరిశీలించారు. అనంతరం పక్కనే ఉన్న రేషన్ డిపోను తనిఖీ చేశారు. రేషన్ బియ్యంలో తేడా రావడంతో డీలర్ ప్రభాకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు తేడా వచ్చిందో నివేదిక అందజేయాలని మేనేజర్ బాలాజీని పీవో ఆదేశించారు. ఏటీడబ్ల్యూవో పురుషోత్తం, వార్డెన్ లక్ష్మీరాజం పాల్గొన్నారు.



వంటశాలను పరిశీలిస్తున్న పీవో ఖుష్బుగుప్తా

విద్యార్థి సంఘాల ఆందోళన

వసతిగృహం తనిఖీకి వచ్చిన విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, యూఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, సన్నీగౌడ్, తిరుపతి శుక్రవారం రాత్రి వసతిగృహం గేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. వాంకిడి, మంచిర్యాల ఆశ్రమ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్‌కు కారణమైన వార్డెన్లు శ్రీనివాస్, లక్ష్మీరాజంలను విధుల నుంచి తొలగించాలని పీవో దృష్టికి తీసుకెళ్లారు. బాలికల వసతిగృహంలో మహిళా వార్డెన్‌ను నియమించాలని వినతిపత్రం అందజేశారు.

'ప్రభుత్వ భూముల కబ్జా సహించం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్, పక్కన కలెక్టర్


బెల్లంపల్లి: ప్రభుత్వ భూముల కబ్జా సహించబోమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. భూ కబ్జాల వ్యవహారంలో ఇటీవల తనపై కొందరు తప్పుడు ఆరోపణలు చేశారని పరోక్షంగా మావోయిస్టుల విమర్శలపై వివరణ ఇచ్చారు. బెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ భూముల ఆక్రమణల ఆరోపణలపై ఆర్డీవోతో విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ బెల్లంపల్లిలో ప్రభుత్వ భూముల ఆక్రమణకు ఎప్పటికప్పుడు చెక్ పెడుతున్నామని తెలిపారు. అక్రమ కట్టడాలను కూల్చివేయడం జరుగుతోందన్నారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ మాట్లాడుతూ బెల్లంపల్లిలో ప్రభుత్వ భూముల కబ్జా ప్రాంతాలు, కూల్చివేసిన కట్టడాల వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జే.శ్వేత, మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎం.మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బస్‌స్టాప్ ఏర్పాటుతో ప్రజలకు సౌకర్యం

బెల్లంపల్లి: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద బస్‌స్టాప్ ఏర్పాటుతో ప్రజలు, రోగులకు సౌకర్యంగా ఉంటుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం ఆర్టీసీ బస్‌స్టాప్‌ను కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించారు.

కుల గణన సర్వే సమగ్రంగా నిర్వహించాలి

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనను సమగ్రంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ఆయన బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 6, 21వ వార్డులు, మండలంలోని తాళ్లగురిజాల గ్రామంలోని 1వ వార్డులో సర్వే తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే వివరాల నమోదును ప్రత్యక్షంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో నిర్దేశించిన అంశాలన్నింటినీ పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఏమైనా అనుమానాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని అన్నారు. గడువులోగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఎంపీడీవో మహేందర్, ఎంపీవో శ్రీనివాస్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నేటి నుంచి ఇంటింటి సర్వే

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో ఇంటింటి సర్వే శనివారం నుంచి పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతీ ఇంటికి స్టిక్కర్లు అతికించడం పూర్తికాగా, శనివారం నుంచి ప్రతీ కుటుంబం నుంచి వివరాలు సేకరించనున్నారు. ఈ మేరకు ఫారాలను ఎన్యుమరేటర్లకు పంపిణీ చేశారు. శుక్రవారం రోజే పలు చోట్ల వివరాలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా 2,54,188 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. ఇంకా కొన్ని చోట్ల కుటుంబాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఒకే ఇంట్లో ఉన్నవారు, అన్నదమ్ములు వేర్వేరుగా నమోదు చేస్తుండడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రతీ కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఇతర అంశాలపై సమగ్రంగా ప్రతీ ఇంటి తలుపుతట్టి సేకరించాల్సి ఉంది. ఈ నెల 6నుంచి ప్రారంభం కావాల్సి ఉన్నా కుల సంబంధింత ప్రశ్నలపై న్యాయపర చిక్కులు రావడంతో ప్రశ్నావళిని స్వల్పంగా మార్పులు చేసి సర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో వచ్చే 20రోజుల్లో జిల్లాలో సర్వే పూర్తి చేసి రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించాల్సి ఉంది. ప్రతీ 150కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ ఉండేలా జాగ్రత్త తీసుకున్నారు. ఎన్యుమరేటర్లుగా ఆ గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఎంఈవోలను నియమించారు. క్షేత్ర స్థాయిలో సర్వే పర్యవేక్షణకు సూపర్‌వైజర్లను నియమించారు. వీరందరికీ ముందుగానే శిక్షణ ఇచ్చారు.

ఒక్కరున్నా చాలు..

సర్వే కోసం ఇంటికి ఎన్యుమరేటర్లు వచ్చిన సమయంలో ఆ కుటుంబం నుంచి ఒక్కరున్నా చాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆ వ్యక్తి కుటుంబ వివరాలు సమగ్రంగా తెలియజేయాల్సి ఉంటుంది. ప్రతీ ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ మేరకు కులం, మతం నుంచి మొదలు, వృత్తి, ఉద్యోగం, భూములు, హోదాలు, రాజకీయ, సామాజికంగా ఆ కుటుంబానికి ఉన్న ప్రతీ అంశం చెప్పుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇంట్లో అన్నీ తెలిసిన ఒక్కరున్నా పూర్తి వివరాలు అందిస్తే సరిపోతుంది. ఆ తర్వాత తమ వివరాలు ఇచ్చినట్లుగా ఓ సంతకం తీసుకుంటారు. ఫొటోలు ఇవ్వాల్సిన అవసరం లేదు. చాలామంది జిల్లా నుంచి విద్య, ఉద్యోగ, వ్యాపారం, తదితర అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. వారందరూ ఎక్కడైనా తమ వివరాలు అందించవచ్చు. వీలుంటే సర్వే కోసం సొంత గ్రామాలకు వచ్చి వివరాలు ఇచ్చిన సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. ఒక వేళ మొదటి దశలో తప్పిపోయిన కుటుంబాలను తదుపరి దశలోనూ గుర్తించి తీసుకుంటారు.

క్లుప్తంగా

రగ్బీ పోటీలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బేల: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకులానికి చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎ.లఖన్, బి.సాయిచరణ్, ఎం.ప్రదీప్‌లు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన జోనల్ స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి, ఈ నెల 10 నుంచి హైదరాబాద్ మల్కాజిగిరిలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 17 పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం ముగ్గురు విద్యార్థులను ప్రిన్సిపాల్ రంగన్న, ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ శివన్న పాల్గొన్నారు.

మునిపల్లి విద్యార్థికి జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కల్లెడ అభిలాష్

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన విద్యార్థి కల్లెడ అభిలాష్ జాతీయ పురస్కారం అందుకున్నారు. మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన కల్లెడ పవిత్ర – ప్రసాద్ దంపతుల కుమారుడు అభిలాష్ తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, మాచి రాజు సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కథల పోటీల్లో పాల్గొని 'మంచి మనుసు' అనే కథా సంపుటిని రాశారు. ఇందుకు జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకున్నారు. అభిలాష్ జగిత్యాల జిల్లాలోని ఏర్గట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి జైలు

మంచిర్యాలక్రైం: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మర్కటోలకు చెందిన కిషోర్‌కుమార్‌కు మంచిర్యాల స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ జడ్జి ఉపనిషధ్వని ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్‌రావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలం మల్లిడి గ్రామానికి చెందిన దుర్గం చంద్రయ్య మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో 2016 అక్టోబర్ 14న రోడ్డుపై లారీ ప్రమాదానికి గురై చనిపోయాడు. అతడి భార్య తలకు గాయమై ఆస్పత్రిలో చేరింది. అప్పటి ఎస్సై అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ప్రమాదానికి కారణమైన కిషోర్‌కుమార్‌కు జైలు శిక్ష విధించారు.

కుక్క పిల్లలకు బారసాల



బారసాల చేస్తున్న రవి కుటుంబ సభ్యులు

కడెం: నిర్మల్ జిల్లా కడెం మండలం చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గిరివేణి రవి తన ఇంట్లో కుక్క పిల్లలకు శుక్రవారం బారసాల చేశాడు. రవి పెంచుకుంటున్న కుక్క ఇటీవలే మూడు పిల్లలకు జన్మనిచ్చింది. శుక్రవారానికి అవి పుట్టి 21 రోజులు కావడంతో బారసాల చేశాడు. బంధువులను, చుట్టుపక్కల వారిని పిలిచి అందరికీ భోజనాలు పెట్టాడు.

సైబర్ చోరులు

మ్యాట్రీమోని పేరుతో రూ.17లక్షలు



ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాకు చెందిన ఎర్ర వెంకటనాగరాజు, సౌజన్య దంపతులు మ్యాట్రీమోని పేరుతో అందమైన అమ్మాయిల ఫొటోలతో ఫేస్‌బుక్ ఖాతా ఏర్పాటు చేసి ఇతరులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ చేయడం, పెళ్లి సంబంధాల కోసం వివరాలు ఇచ్చిన వారికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టడం, ఫ్రెండ్ రిక్వెస్ట్ అక్సెప్ట్ చేయగానే వారితో చాటింగ్ చేస్తూ పరిచయం పెంచుకుని కొంతకాలం తర్వాత బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేసేవారు. ఈ క్రమంలో జిల్లాకు చెందిన ఓ యువకుడిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేయగా.. దశలవారీగా రూ.17లక్షలు ముట్టజెప్పాడు. అయినా వేధింపులు ఆగకపోవడంతో యువకుడు రామగుండం సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు వెంకటనాగరాజు, సౌజన్యలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగం అంటూ..



ఇన్‌స్టాగామ్ యాప్‌లో పార్ట్ టైమ్ ఉద్యోగం పేరుతో నస్పూర్‌లోని రాంనగర్‌కు చెందిన అడెపు శివకుమార్‌తోపాటు తన బంధువులు, స్నేహితులు రూ.1,57,319 సైబర్ మోసగాళ్ల చేతిలో నష్టపోయారు. శివకుమార్ తన ఇన్‌స్టాగామ్ యాప్‌లో పార్ట్ టైం ఉద్యోగం లింక్‌ను ఓపెన్ చేయగా టెలిగ్రామ్ యాప్‌లో సయ్యద్ మెకలిన్ అనే గుర్తు తెలియని వ్యక్తుల ప్రొఫైల్స్‌తోపాటు మరికొందరికి చెందిన ప్రొఫైల్స్ ఓపెన్ అయ్యాయి. కొంత పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పడంతో పలు దఫాలుగా రూ.1,57,319 ఫోన్ పే ద్వారా పంపించారు. సమాధానం రాకపోవడం, ఫోన్లు స్విచ్ఛాఫ్ రావడంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

క్రిప్టో మోసం..



క్రిప్టో పేరుతో సీతరాంపల్లి గ్రామానికి చెందిన బొల్లం భీమయ్య రూ.67వేలు నష్టపోయాడు. 2024 అక్టోబర్ 10న తన ఇన్‌స్ట్రాగామ్ యాప్‌లో క్రిప్టో అనే పేజీ ప్రకటనలో రూ.10వేలు పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని చెప్పడంతో భీమయ్య గుర్తు తెలియని వ్యక్తి పంపిన బ్యాంకు ఖాతాకు పలు దఫాలుగా రూ.67వేలు పంపించాడు. సదరు వ్యక్తి నుంచి సమాచారం రాకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930లో ఫిర్యాదు చేయగా రూ.32వేలు ఫ్రీజ్ చేశారు.

- మ్యాట్రీమోని పేరుతో మోసాలు
- ఓటీపీ చెప్పకపోయినా బ్యాంకు ఖాతా ఖాళీ

మంచిర్యాలక్రైం: ఆధునిక టెక్నాలజీని తమకు అనుకూలంగా మలుచుకుని కొందరు సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతూ దోచుకుంటున్నారు. పోలీసు యంత్రాంగం ఎంత అప్రమత్తం చేస్తున్నా ఎక్కడో ఒక చోట మోసాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఝార్ఖండ్‌లోని జమ్‌తార జిల్లాలోని ఏడు గ్రామాలకు చెందిన యువత సైబర్ నేరాలే ప్రధాన ఆదాయ వనరుగా మలు చుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. బ్యాంకుల్లోని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, కాల్‌సెంటర్లు తదితర మార్గాల్లో డెబిట్ కార్డుల డేటా సైబర్ మోసగాళ్లకు చేరుతోంది. బోగస్ పేర్లు, చిరునామాలతో సిమ్‌కార్డులు తీసుకునే జమ్‌తార యువకులు వాటి విని యోగానికి బేసిక్ మోడల్, తక్కువ ఖరీదున్న సెల్‌ఫోన్లు వాడుతుంటారు. వీటితో తమ వద్ద ఉన్న సమాచారంతో బ్యాంకు వినియోగదారులకు ఫోన్ చేస్తుంటారు. ఇటీవల కాలంలో అందరి ఫోన్లలోనూ ట్రూ కాలర్ తరహా యాప్స్ ఉంటున్నాయి. బోగస్ సిమ్‌కార్డుల వినియోగదారులు ముందుగానే ఆయా నంబర్లను సదరు యాప్‌లో 'బ్యాంకు హెడ్ ఆఫీస్' పేరుతో రిజిష్టర్ చేస్తున్నారు. ఫలితంగా ఈ నంబర్ నుంచి ఫోన్ రాగానే బ్యాంకు నుంచి అనే భావన కలిగి తేలిగ్గా బుట్టలో పడుతున్నారు. ప్రతీ లావాదేవీకి ఒక ఓటీపీ కచ్చితంగా ఉండాలి. దీనిని పదేపదే వినియోగదారుడిని అడగకుండా కొత్త ఎత్తు వేస్తున్నారు. లక్ష్యంగా చేసుకున్న వారికి లింకులు పంపించడం ద్వారా టీమ్ వ్యూయర్ యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఓ పాస్‌వర్డు చెప్పి యాక్టివ్ చేసుకోవాలని చెబుతున్నారు. బాధితుడు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని యాక్టివేట్ చేసిన వెంటనే ఫోన్ స్క్రీన్ సైబర్ నేరగాడి ల్యాప్‌టాప్‌లో కనిపిస్తుంది. ఫలితంగా వచ్చిన ప్రతీ ఓటీపీని అడగాల్సిన పని లేకుండానే వీలైనంత వరకు ఖాతా ఖాళీ చేయడానికి ఆస్కారం ఏర్పడుతోంది.



పకడ్బందీ పరిశోధనతోనే..

ఒక్కసారి బాధితుడి ఖాతా నుంచి ఖాళీ అయిన డబ్బులు రాబట్టడం అంత సులభమేమి కాదు. తెలంగాణ పోలీస్ యంత్రాంగం సైబర్ నేరగాళ్లకు సంకెళ్లు వేసేందుకు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక అవగాహన, శిక్షణ కల్పించింది. ఫిర్యాదు అందిన వెంటనే బాధితుడు పోగొట్టుకున్న డబ్బు ను రాబట్టడంపై దృష్టి సారిస్తున్నారు. అనంతరం నేరస్తులు వినియోగించిన సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా బాధితుడి ఖాతా నుంచి డబ్బు ఎక్కడికి బదిలీ అయింది..? ఆన్‌లైన్ షాపింగ్ జరిగితే ఏ చిరునామాకు వస్తువు, సామగ్రిని ఆర్డర్ చేశారు..? తదితర వివరాల ఆధారంగా దర్యాప్తు చేస్తారు.

11యాప్‌లు గుర్తించాం..



సైబర్ నేరగాళ్లు ఉపయోగించే 11యాప్‌లను గుర్తించాం. వీటిని ఇన్‌స్టాల్ చేసుకుని పాస్‌వర్డు సైబర్ నేరగాళ్లకు చెబితే మన ఫోన్ వారి యాక్సెస్‌లోకి వెళ్తుంది. ఇలాంటి యాప్స్‌ను సైబర్ నేరగాళ్లు వినియోగించాలంటే కచ్చితంగా బాధితుడి ఫోన్ యాక్టివ్‌గా ఉండాలి. స్క్రీన్ లాక్ చేస్తే నేరగాళ్లు యాక్సెస్ చేయలేరు. అందుకే వీటిని వినియోగించి టోకరా వేసే సైబర్ క్రిమినల్స్ ఆ సమయంలో బాధితులకు ఫోన్ చేసి మాటల్లో ఉంచుతారు. అపరిచితులు పంపే లింకులు ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. బ్యాంకర్లు ఫోన్లు చేయరు, వ్యక్తిగత సమాచారం అడగరని గుర్తుంచుకోవాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– ఎం.శ్రీనివాసులు, రామగుండం పోలీస్ కమిషనర్

లక్ష్యాన్ని సాధించాలంటే పట్టుదల, క్రమశిక్షణ ఉండాలి

- బీహార్ పరిపాలనా విభాగం ముఖ్య కార్యదర్శి బొమ్మకంటి రాజేందర్



పాఠశాలలో మాట్లాడుతున్న రాజేందర్

బోథ్: కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చని బీహార్ రాష్ట్రంలో పరిపాలన విభాగం ముఖ్య కార్యదర్శి బొమ్మకంటి రాజేందర్ అన్నారు. బోథ్ మండలంలోని కౌఠబి గ్రామానికి చెందిన రాజేందర్ ప్రస్తుతం బీహార్ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల తన సొంత గ్రామానికి వచ్చిన ఆయన తాను చదువుకున్న పాఠశాలను శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో తిరుగుతూ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న పథకాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకుని, వాటిని సాధించేందుకు ప్రయత్నించాలన్నారు. తాను ఐఏఎస్ కావడానికి తాను పుట్టి పెరిగిన గ్రామం, చదవిన పాఠశాలే కారణమన్నారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ కుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు వినాయక్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు బదాల శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్, సోమేశ్వర్, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మందమర్రిలో నకిలీ నోట్ల కలకలం



వ్యాపారి వద్ద ఒకే నంబర్‌తో ఉన్న రూ.200 నోట్లు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాల చెట్టు ఏరియా కూరగాయల మార్కెట్‌లో నకిలీ కరెన్సీ నోట్లు కలకలం రేపుతున్నాయి. హోల్‌సేల్ కూరగాయల వ్యాపారి పవన్‌కుమార్ చిరు వ్యాపారులకు కూరగాయలు వేసి సాయంత్రం డబ్బులు తీసుకెళ్తుంటాడు. ఈ క్రమంలోనే ఈ నెల 5న కూరగాయల వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసుకుని ఇంటికి వెళ్లి లెక్కించే సమయంలో నకిలీ రూ.200 నోట్లు కనిపించాయి. ఒకే నంబరుతో ఉన్న మూడు కరెన్సీ నోట్లు దర్శనమిచ్చాయి. గురువారం రూ.200 నోట్లు మరో రెండు ఆయనకే వచ్చాయి. వీటిపైనా ఒకే నంబర్లు ఉండడం గమనార్హం. మార్కెట్‌లో రూ.200, రూ.500 నోట్లు నకిలీవి చెలామణి అవుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ నోట్ల విషయమై ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా.. వ్యాపారి పవన్‌కుమార్‌కు నకిలీ నోట్లు వచ్చాయని తెలిపాడని, ఆ నోట్లను తీసుకుని రావాలని సూచించగా రాలేదని పేర్కొన్నారు. నకిలీ నోట్లపై పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి



వివాహిత మృతదేహం వద్ద వివరాలు నమోదు చేసుకుంటున్న తహసీల్దార్, ఎస్సై

దస్తురాబాద్: వరకట్న వేధింపులకు జిల్లాలో మరో వివాహిత బలైంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండంలోని రేవోజీపేట గ్రామానికి చెందిన సంద నాగరాజుకు జగిత్యాల జిల్లా సారాంగపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన లతతో ముడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 15 నెలల కుమారుడు ఉన్నాడు. కొన్ని రోజులుగా భర్త నాగరాజు, అత్త, మామ సంద సత్తవ్వ, వెంకటి అదనపు కట్నం తేవాలని లతను వేధిస్తున్నారు. వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం బాత్‌రూంలో ఉరివేసుకుంది. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ నావాజ్ సర్ఫరాజ్ చేరుకుని పంచనామా చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతురాలి తల్లి పోగుల మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలింత అదృశ్యం

- మూడు రోజుల క్రితం ఆడపిల్ల జననం
- శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించని తల్లి
- నిర్మల్ మాతాశిశు ఆస్పత్రిలో ఘటన



నాగమణి

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆస్పత్రి నుంచి బాలింత శుక్రవారం అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా మండలం అస్గుల్ గ్రామానికి చెందిన నాగమణి మూడు రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనించ్చింది. ఈమెకు భర్త సాయినాథ్, ఇదివరకే ఒక పాప, బాబు ఉన్నాడు. భర్త వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి బిడ్డ ఆరోగ్యంగానే ఉనానరు. అయితే మధ్యాహ్నం తర్వాత నుంచి నాగమణి కనిపించలేదు. దీంతో బంధువులు ఆస్పత్రి ఆవరణలో వెతికారు. ఆచూకీ లేకవడంతో భర్త సాయినాథ్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సాయంత్రం ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఆస్పత్రికి వెళ్లి సీసీ పుటేజీలను పరిశీలించారు. ఇందులో నాగమణి తానే స్వయంగా బెడ్ మీది నుంచి ఆస్పత్రి బయటకు వెళ్లినట్లు రికార్డు అయింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలోని దస్నాపూర్‌గూడ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దస్నాపూర్‌గూడ గ్రామానికి చెందిన జవాదే విలాస్ –కవిత దంపతుల కూతురు జవాదే అంజలి(13) బజార్‌హత్నూర్ మండలకేంద్రంలోని కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. శుక్రవారం ఉదయం తల్లి కవితతో కలిసి వ్యవసాయ చేనులో పత్తి ఏరడానికి వెళ్లింది. సాయంత్రం నీళ్లు తాగి వస్తానని తల్లితో చెప్పి ఇంటికి వెళ్లిన అంజలి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయింది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ఆటోలో మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. కాగా ఆత్మహత్యపై ఎవరూ ఫిర్యాదు అందలేదని ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన హబీబ్ ఖాన్(42) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు జైనథ్ ఏఎస్సై ఆత్మారాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఖుర్షీద్‌నగర్‌కు చెందిన హబీబ్‌ఖాన్ తన రెండో భార్య మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. జైలుకు వెళ్లి ఇటీవల బయటకు వచ్చాడు. జైనథ్‌మండలంలోని మేడిగూడలో తన మొదటి భార్య జమీలా పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటుంది. కాగా శుక్రవారం మేడిగూడ గ్రామ సమీపంలోని పంట పొలాల్లో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన జేబులో ఉన్న సూసైడ్ నోట్‌లో తన రెండో భార్యను హత్య చేశానని, తనకు జీవించే హక్కు లేదని ఉన్నట్లు ఏఎస్సై తెలిపారు. తన ఆత్మహత్యకు మొదటి భార్య, పిల్లలకు సంబంధం లేదని అందులో రాసి ఉందన్నారు. కాగా భార్య జమీలా తన భర్త కొంత కాలంగా మద్యానికి బానిసై తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, పలుమార్లు నచ్చజెప్పినా వినిపించుకోలేదని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని కొమ్ముతండాకు చెందిన జి.రమేశ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. గ్రామంలోని కిరాణ దుకాణం నిర్వాహకుడు జి.రమేశ్‌కు అదే గ్రామానికి చెందిన సమీప బంధువు గుగ్లావత్ రమేశ్‌నాయక్‌కు పాత గొడవలు ఉన్నాయి. జి.రమేశ్ గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న గుగ్లావత్ రమేశ్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి కేకలు వేయడంతో పారిపోయాడు. ఈ మేరకు గుగ్లావత్ రమేశ్ తల్లిఇచ్చిన ఫిర్యాదు మేరకు జి.రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వైద్య విద్యార్థినికి దాతల ఆపన్నహస్తం

సాక్షి ఎఫెక్ట్

నెన్నెల: కన్నెపల్లి మండలంలోని రెబ్బెన గ్రామానికి చెందిన గిరిజన నిరుపేద విద్యార్థిని మానేపల్లి శిరీషకు దాతలు ఆర్థిక చేయూతనందిస్తున్నారు. ఈ నెల 3న 'చదువుల తల్లిని ఆదుకోండి' శీర్షికన ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. శుక్రవారం వరకు వైద్య విద్యార్థినికి రూ.లక్ష ఆర్థిక సాయం అందింది. నెన్నెలకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శ్రీరాంభట్ల రంజిత్ రూ.10 వేలు, ప్రవాస భారతీయుడు తోడే కృష్ణారెడ్డి రూ.10 వేలు ఫోన్‌పే ద్వారా పంపించారు. మిగతా దాతలు మరో రూ.10 వేలు ఫోన్ పే చేశారు. సాయం అందేలా కృషి చేసిన 'సాక్షి'కి విద్యార్థిని తల్లిదండ్రులు మానేపల్లి పెంటయ్య, లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు



గాయపడిన తిరుమల్

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత బెల్లంపల్లి క్రాసింగ్ సమీపంలో శుక్రవారం సాయంత్రం కారు ఢీకొని లంబాడితండాకు చెందిన ధరావత్ తిరుమల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రహదారిపై లంబాడితండా నుంచి పాతబెల్లంపల్లి వైపు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఎగిరి డివైడర్‌పై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన కారు ఆపకుండా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించగా.. ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

NOTICE

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE AT LUXETTIPET.
I.A.NO. 292 OF 2024
IN
O.S.NO. 51 of 2015

Between:-
Chintha Satyanarayana, ... Petitioner/Plaintiff.
AND
Maggidi Lachanna ... Defendant
AND
Maggidi Venkatesh ... Proposed Defendant No.4

To:
Maggidi Venkatesh, S/o. Lachanna, age: 32 years, Occ: Agril., R/o. Dharmaram, R/M. Jannaram, Dist. Mancherial.

Whereas the above named Petitioner/Plaintiff has filed the above Petition Under Order 24 Rule 3 and 4 against you. You are the Proposed Defendant No.4 in the above Suit. Therefore, you are hereby required to appear before this Court by personally or through your pleader on 25-11-2024 at 10.30 a.m. If you fail to appear before this Court on the above said date, the case will be heard and determined in your absence.

// By the order of the Court//
Sd/- N.RAVINDER, ADVOCATE, LUXETTIPET.